క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితా ప్రదర్శన

కూసుమంచి: మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాలను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. దీనిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 12లోగా తెలపాలని, 12న అన్ని రాజకీయ పార్టీల నాయకులతో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించబడుతుందని వివరించారు.

సంక్రాంతికి మార్కెట్ నిర్మాణం పూర్తి

ఖమ్మంరూరల్: సంక్రాంతి వరకు మద్దులపల్లి మార్కెట్ నిర్మాణం పూర్తి చేస్తామని కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు అన్నారు. శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డితో కలిసి మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రి పొంగులేటి ఆదేశాలతో పనులను శరవేగంగా జరుగుతున్నాయని, దీంతో రైతులు ఖమ్మం మార్కెట్ వెళ్లాల్సిన పనిలేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: వెలమ సామాజిక వర్గంపై ఎమ్మెల్యే శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పద్మనాయక వెలమ అసోసియేషన్ జిల్లా నాయకుడు చెరువు నరసింహారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కమదన ప్రవీణ్, సాగి రామారావు, పి.వెంకటేశ్వరరావు, ఫిరోజ్, కిషన్‌రావు, కె.వెంకటేశ్వరరావు, పి.అజయ్, పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శిగా డిప్యూటేషన్‌పై దినేష్‌కుమార్‌ను బదిలీ చేస్తూ శనివారం జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. కోనాయిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన ప్రవీణ్ వివిధ కారణాలతో కారేపల్లి మండలానికి బదిలీ కాగా కోరట్లగూడెం పంచాయతీ కార్యదర్శి రవి ఇన్‌చార్జ్ బాధ్యతలు చూస్తున్నారు. ఈనేపథ్యాన ఎర్రుపాలెం మండలంలోని భీమవరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న దినేష్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

స్వాతంత్య్ర సమరయోధురాలు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు అంబటి అన్నపూర్ణమ్మ(93) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆమెకు కుమారుడు, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతదేహాన్ని నాయకులు వి.సుదర్శన్‌రెడ్డి, తమ్మినేని కోటేశ్వరరావు, సప్పిడి ప్రభాకర్, గురుమూర్తి, పి.నాగేశ్వరరావు, నల్లపునేని భాస్కర్‌రావు, రమణయ్య తదితరుల సందర్శించి నివాళులర్పించారు.

నివాళి

ఖమ్మంఅర్బన్: అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన చిత్తారు శ్రీహరి యాదవ్ 13వ వర్ధంతిని గోకులకృష్ణ భవనంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ మాజీ చైర్మన్, కుల కృష్ణసేవా సమితి ట్రస్ట్ చైర్మన్ కూరాకుల నాగభూషణం శ్రీహరి చిత్రపటానికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు బట్టు షరాబంది, కోడి లింగయ్య, ఎర్రబోయిన గోవిందరావు, మూడుముంతల గంగరాజు, నరసింహారావు, భారీ మల్సూర్, బట్టు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి



గొర్రెలను చూపిస్తున్న బాధితులు

తిరుమలాయపాలెం : మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన వరద పద్మ గొర్రెలు, మేకలు పెంచుతూ జీవనం సాగిస్తోంది. కాగా, ఇంట్లో పాకలో ఉంచిన నాలుగు గొర్రెలు.. శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డాయి. గొర్రెల పెంపకమే జీవనాధారమైన తమకు ఈ ఘటన తీవ్ర నష్టాన్ని కలుగజేసిందని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన గొర్రెల విలువ రూ.60 వేల వరకు ఉంటుందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ తమిర వెంకటరెడ్డి కోరారు.

నిద్రావస్థలో నిఘా..!

నేలకొండపల్లి మండల కేంద్రంలో నిఘా నేత్రాలు నిద్రపోతున్నాయి. దీంతో అక్రమార్కులు రాజ్యమేలుతుండగా.. దొంగతనాలు, మద్యం మత్తులో యువత కొట్లాటలు ఇష్టానుసారంగా సాగిస్తున్నారు. అంతేకాక ఏదైనా సంఘటన జరిగితే అక్కడక్కడ దుకాణాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలపై ఆధారపడి దర్యాప్తు చేయాల్సి వస్తుంది. కాగా, ఇటీవల జరిగిన జంట హత్య నేపథ్యాన సీసీ కెమెరా విలువ ఏమిటో అధికారులకు తెలిసివచ్చినట్లయింది. - నేలకొండపల్లి



నేలకొండపల్లి ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

అలంకారప్రాయంగా నిఘా నేత్రాలు

- రెండేళ్లుగా పనిచేయని వైనం
- అవసరమైన చోట ఉండవు.. ఉన్నవి పని చేయవు
- ఇదే అదునుగా అక్రమార్కుల ఇష్టారాజ్యం
- నేరాల నియంత్రణకు పోలీసుల పాట్లు



అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

రెండేళ్లుగా..

పాలేరు నియోజకవర్గంలో గతంలో పాలకులు రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన దాదాపు 16 నిఘా నేత్రాలు నేడు అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. డివిజన్‌లోని నేలకొండపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయం, ప్రధాన సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీలు గత రెండేళ్ల నుంచి పని చేయడం లేదు. దీంతో రోజురోజుకు నేరాలు పెరిగిపోతున్నాయి. ఖమ్మం–కోదాడ ప్రధాన రహదారి సెంటర్‌లో కోదాడ, కూసుమంచి, ఖమ్మం, సింగారెడ్డిపాలెం వైపు మొత్తం నాలుగు కూడలిగా ఉన్న సెంటర్‌లో నాలుగు, కాలేజీ, మసీద్, వెంకటేశ్వరస్వామి దేవాలయం, తదితర చోట్ల సీసీ కెమెరాలను అమర్చారు. కాగా, చెరువుమాధారం క్రాస్ రోడ్డు –బౌద్ధక్షేత్రం వరకు రహదారి విస్తరణలో భాగంగా స్తంభాలు తీసే క్రమంలో వైర్లు మొత్తం తెగిపోయాయి. నాటి నుంచి అవి పనిచేయకపోవడంతో నేరాల నియంత్రణకు అవి ఏ మాత్రం ఉపయోగపడడం లేదు.

పోలీసుల విస్తృత ప్రచారం..

నేరాల నియంత్రణకు ప్రతి చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసు శాఖ విస్తృతంగా ప్రచారం చేస్తున్నా సరైన స్పందన రావడం లేదు. కాగా, మండలంలోని చెరువుమాధారం, మంగాపురంతండా తదితర గ్రామాల్లో సీసీలు ఏర్పాటు చేశారు కానీ నిర్వహణ లోపంతో అవి పనిచేయడం లేదు. ఇటీవల స్థానిక ఎస్సై పి.సంతోష్ ఆధ్వర్యాన అవగాహన సదస్సులు నిర్వహించగా.. కొత్త కొత్తూరు గ్రామానికి చెందిన చెరువు స్వర్ణ ఆర్థిక సాయమందిస్తానని ముందుకొచ్చారు. కాగా, రాజేశ్వరపురం, బోదులబండ, చెన్నారం, పైనంపల్లి, అప్పలనరసింహాపురం తదితర గ్రామాల్లో తప్పనిసరిగా సీసీలను ఏర్పాటు చేయాల్సి అవసరం ఎంతైనా ఉంది.

8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం



గ్రామ ప్రయోజనాల కోసం దాతల నుంచి 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. పాలకవర్గాలు పదవీ కాలం ముగిసిన తర్వాత అధికారులు పట్టించుకోవడం మానేశారు. దీంతో అవి సక్రమంగా పనిచేయడం లేదు. వాటి నిర్వహణను పంచాయతీలకు అప్పగించాల్సిన అవసరం ఉంది.

– భూక్యా సుధాకర్, మాజీ సర్పంచ్, మంగాపురంతండా

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ప్రతీ గ్రామంలో కనీసం 5 నుంచి 10 సీసీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు, గ్రామ శివారులో ఏర్పాటు చేస్తే నేరాల నియంత్రణ సులువవుతుంది.

– అనంతు ఉపేందర్, బోదులబండ

అవగాహన కల్పిస్తున్నాం



సీసీ కెమె ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నాం. నేరాల నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో ఎవరైనా అపరిచితులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇస్తే నేరాల బారిన పడకుండా తమ వంతు చర్యలు తీసుకుంటాం.

– పి.సంతోష్, ఎస్సై, నేలకొండపల్లి

కలెక్టర్‌కు తపాలా బుక్‌లెట్ అందజేత



కలెక్టర్‌కు బుక్‌లెట్ అందజేస్తున్న వీరభద్రస్వామి

ఖమ్మంగాంధీచౌక్: 'మన తపాలా – మన సేవలు' పేరిట శాఖ రూపొందించిన బుక్‌లెట్ తొలి కాపీని శుక్రవారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వి.వీరభద్రస్వామి మాట్లాడుతూ బుక్‌లెట్‌లో తపాలా సేవలు, పథకాల సమస్త సమాచారం ఉన్నందున ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ప్రథమ చికిత్స కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, డీఎంహెచ్‌ఓ

కలెక్టరేట్‌లో ప్రథమ చికిత్స కేంద్రం..

ఖమ్మంవైద్యవిభాగం: కలెక్టరేట్‌లో ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రథమ చికిత్స కేంద్రాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలు వస్తే కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఏఓ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై అవగాహన

కూసుమంచి/కామేపల్లి/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారా అర్హులను ఎంపిక చేస్తారని ఎంపీడీఓలు వేణుగోపాల్‌రెడ్డి, రవీందర్, సిలార్‌సాహెబ్,ఎం.యర్రయ్య పేర్కొన్నారు. శనివారం ఆయా మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో జీపీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. యాప్ పనితీరుపై సర్వేలో పాల్గొనే సిబ్బందికి వివరించి పకడ్బందీగా నిర్వహించి ఈ నెల 20లోగా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈనేపథ్యాన కూసుమంచి గ్రామంలో యాప్‌లో వివరాల నమోదును వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించగా కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ కరుణశ్రీ, ఐకేపీ ఏపీఎం సత్యవర్ధన్ రాజు, గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కామేపల్లిలో తహసీల్దార్ సుధాకర్ అధ్యక్షతన అవగాహన కల్పించగా.. కార్యక్రమంలో ఏపీఓ శ్రీరాణి, ఏపీఎం సురేందర్‌బాబు, ఎంపీఓ ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రామకృష్ణ ఎంపీఓ పి.సూర్యనారాయణ, ఏపీఓ కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అంతేకాక నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ జె.మానిక్‌రావ్, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, ఆయా పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి: యాప్‌లో వివరాల నమోదును పరిశీలిస్తున్న అధికారులు

సమస్యలపై మంత్రి తుమ్మలకు వినతి



రఘునాథపాలెం: మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వేపకుంట్ల గ్రామస్తులు

- రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల గ్రామ సమస్యలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శనివారం గ్రామస్తులు కలిసి వినతి పత్రం అందించారు. గ్రామంలో మిగిలిపోయిన 300 మీటర్ల డొంక రోడ్డుకు రూ.5లక్షలు మంజూరు చేయాలని, గ్రామంలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్‌లైన్‌ను మార్చాలని, ఆ వైర్లతోనే గత నెలలో మేక వెంకన్న మృతిచెందాడని విన్నవించారు. ఈ కార్యక్రమలో మాజీ సర్పంచ్ రెమల్లె రమేష్‌బాబు, మాజీ ఎంపీటీసీ రెంటాల దానయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు చేవగాని రామారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.
- ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): రైల్వే మూడవ లైన్ నిర్మాణంతో 48వ డివిజన్ సారధినగర్ ప్రాంతంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తాము నిర్వాసితులైనామని స్థానికులు ఆందోళన చెందారు. ఈమేరకు శనివారం ఖమ్మం సారధినగర్ అండ్ మామిళ్లగూడెం బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు వినతి పత్రం అందజేశారు. రైల్వే అధికారులతో సమాలోచన చేసి తమ గృహాలకు అనుగుణంగా కొత్తగృహాలు ఇప్పించాలని కార్పొరేటర్ తోట రామారావుకు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వంగాల వెంకట్, డివిజన్ అధ్యక్షుడు చేతికృష్ణ, మైనారిటీ నాయకుడు షేక్ బాబా, కిషన్‌నాయక్, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

- ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని ఏదులాపురం సబ్‌స్టేషన్ ఏఈ ప్రభాకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి పెదతండా, సాయిప్రభాత్‌నగర్, టీచర్స్ కాలనీ, నాయుడుపేట, లుంబినివనం, తాల్లేసేతండా, టీఎన్‌జీవోస్ కాలనీ, సాయిప్రభాత్‌నగర్ 2, బీబీఎం స్కూల్ రోడ్, ఆర్ఎస్‌నగర్, జలగంనగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.
- ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఎన్నెస్పీ విద్యుత్ సబ్ స్టేషన్ వైరారోడ్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మంచికంటి భవన్, సరిత క్లినిక్, రేవతి సెంటర్, వైరారోడ్‌లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 ఏడీఈ నాగార్జున తెలిపారు.

ఎస్సీ వర్గీకరణపై జాప్యం తగదు

ఖమ్మంరూరల్: తెలంగాణలో మాదిగ, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయాన్ని అందించే ఎస్సీ వర్గీకరణ జీఓ అమలులో సీఎం రేవంత్‌రెడ్డి జాప్యం వీడాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు వంగూరి ఆనందరావు తెలిపారు. మండలంలోని పల్లెగూడెంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 11న మారెమ్మ ఆలయం వద్ద జరిగే ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీల నిర్మాణ సదస్సును జయప్రదం చేయాలన్నారు. భవానీ, వెంకటేష్, సుమలత, డి.లక్ష్మి, మరియమ్మ, సాయి, తిరపమ్మ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంరూరల్: ఈనెల 14, 15 తేదీలలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ జిల్లా ఆరవ విద్యా మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.నవీన్‌కుమార్, పి.మహేష్‌లు తెలిపారు. శనివారం మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనే లక్ష్యంగా సంఘం పని చేస్తుందన్నారు. సంఘం నాయకులు ఎన్.శైలజ, ఎం.లక్ష్మీకుమారి, హెచ్.రంగమ్మ, బి.వర్మ, ఎండీ షాబుద్దీన్, ఎం.ఆదిలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

దమ్మాయిగూడెంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి



ఆందోళన చేస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: మండలంలోని అన్ని గ్రామాలకు సెంటర్‌గా ఉన్న దమ్మాయిగూడెంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఆపాలని కోరుతూ శనివారం దమ్మాయిగూడెంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా ఆధ్వర్యాన రాష్ట్రీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు తిమ్మిడి హన్మంతరావు మాట్లాడుతూ.. ఖమ్మం నుంచి దమ్మాయిగూడెం, బచ్చోడు, కాకరవాయి, సూర్యాపేట వరకు హైదరాబాద్‌కు బస్సు నడిపించాలని, దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవచూపి ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ ఆగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లుతో పాటు వివిధ పార్టీల నాయకులు కూసు అప్పారావు, పమ్మి వెంకటేశ్వర్లు, వేముల ఉపేందర్, మట్టే గురుమూర్తి, చింతిరాల నాగభూషణం, ఉన్నం నరేష్, నాగేశ్వరరావు, పమ్మి జగదీష్, తిమ్మిడి రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలులో ప్రభుత్వం విఫలం

రఘునాథపాలెం: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయి అమలులో విఫలమైందని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకుడు కేలోతు లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలంలోని వేపకుంట్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా.. 30 శాతం మేరకు రైతులకు మాఫీ అయిందన్నారు. ఇకనైనా రుణమాఫీతో పాటు రైతు భరోసా అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జర్పుల దేవల, షేక్ మదార్‌సాహెబ్, ఆవుల మంగతాయి, భూక్య శంకర్‌తో పాటు ఝాన్సీ, రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



నేలకొండపల్లిలో విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎంఈఓ చలపతిరావు

కామేపల్లి/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం : గ్రామీణ స్థాయిలో యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు సీఎం కప్ – 2014 పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు ఆయా మండలకేంద్రాల్లో శనివారం ప్రారంభమయ్యాయి. ఈనేపథ్యాన కామేపల్లి మండలంలోని పాతలింగాల ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో నిర్వహించిన పోటీలను తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి ప్రారంభించగా.. గింజల నరసింహారెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలంలోని బోదులబండ, నేలకొండపల్లి, రాజేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో పోటీలను మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు ప్రారంభించగా.. ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సీహెచ్.శివ, పీఈటీలు, పీడీలు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలయపాలెం మండలంలోని జల్లెపల్లి, పిండిప్రోలు, తిరుమలాయపాలెం గ్రామాల్లో జెడ్పీ హైస్కూల్‌లో తహసీల్దార్ ప్రారంభించగా.. ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎస్సై కూచిపూడి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



ఎగ్జిబిషన్‌లో చీరలు పరిశీలిస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని టీటీడీ కళ్యాణమండపంలో కళాసిల్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంటోంది. దేశంలో ఎంపికైన కళాకారులచే అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు తమ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు వినోద్ తెలిపారు. ఇందులో మూగా అండ్ ఎరిశిల్క్, బాగల్పూర శిల్క్స్, టస్సర్, ట్రిబిల్ వర్క్ కోసా శిల్క్, బాందని, కచ్ఛ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, బెడ్‌కవర్లు, కుషన్ కవర్లు, డ్రెస్ మెటీరియల్ కూడా లభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్‌లో తెరిచి ఉంటుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'గీతాంజలి'కి అవార్డు



అవార్డు అందుకుంటున్న డైరెక్టర్లు పద్మ, అరుణ్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని గీతాంజలి పాఠశాలకు ట్రైబల్ బ్లేజర్ అవార్డు లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు, డైరెక్టర్లు టి.పద్మ, అరుణ్‌లు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో బ్రెయిన్ ఫీడ్ మాగజైన్ నిర్వహించిన విద్యా సదస్సులో అవార్డు లభించగా.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్న క్రమంలో తమ పాఠశాలకు ఈ గౌరవం దక్కిందన్నారు. ఈమేరకు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పలువురు ప్రముఖులు యజమాన్యానికి అభినందనలు తెలిపారు.

'ఎస్‌బీఐటీ'లో స్వాగత వేడుకలు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన స్వాగత వేడుకలను కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోబోటిక్స్, డ్రైవర్స్ కార్, పారిశ్రామిక రంగాల్లో కంప్యూటర్ సైన్స్‌కు దీటుగా ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ విద్యార్థులకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ఈ తర్వాత కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్‌లు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నూతన విద్యార్థులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు అమిత్ బింధాజ్, టి.చరణ్‌సింగ్, కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు,ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో ఆర్మీ ఫ్లాగ్‌డే

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఆర్మీఫ్లాగ్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన సైనికుల కోసం నిధుల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కె.నవీన్‌బాబు మాట్లాడుతూ.. నిధుల సేకరణ సైనిక సభ్యులు, పౌరుల మధ్య ఐక్యత, దేశభక్తి భావనను పెంపొందిస్తామయన్నారు. డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, ప్రిన్సిపాల్ బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'సర్వజ్ఞ' విద్యార్థిని ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: నాగపూర్‌కు చెందిన అఖిల్ నటరాజం అంతర్ సాంస్కృతిక సంగ్ ఆధ్వర్యంలో ఆలిండియా 15వ కల్చరల్ డ్యాన్స్ కాంటెస్ట్ అండ్ ఫెస్టివల్ నృత్య ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థిని ఎం.సాయిరిద్ధి ప్రతిభ కనబర్చినట్లు సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించాక మాట్లాడారు.

విద్యార్థుల భవిష్యత్‌కు పాటుపడాలి

కూసుమంచి: విద్యార్థుల భవిష్యత్‌కు వారి తల్లిదండ్రులు పాటుపడాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రరావు కోరారు. శనివారం కూసుమంచిలోని కళాశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించి కళాశాల అభివృద్ధికి వారి సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో ప్రవేశానికి ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ఎన్‌సీసీ 'బి'సర్టిఫికెట్ కోసం ప్రవేశం పొందడానికి 11వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యాన విద్యార్థులకు పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను 11వ తెలంగాణ కమాండింగ్ అధికారి కల్నల్ సంజయ్‌బాద్రా పర్యవేక్షణలో జరిగాయని.. తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుతి, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డిలు తెలిపారు. ఏఓ నవీన్ యాదవ్, ఏఎన్ఓ జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మమత ఆస్పత్రి రోడ్‌లోని శ్రీచైతన్య ఒలంపియాడ్ విద్యార్థులు నేషనల్ ఏరినోటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) కాంటెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను శనివారం ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజలక్ష్మి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల డీజీఎం చేతన్ మాదూర్, కో ఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మ, ఏడుకొండలు, వైస్ ప్రిన్సిపాళ్లు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, డీన్స్ కేవీఆర్ నాసా ప్రోగ్రాం ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.